# దర్పానికి చురక

-బాణగిరి వసుంధర

అది చిన్నపొదరింటిలాంటి పొందికైన ఇల్లు. అందమైన పూల తీగెలు ఇంటికి ముందు భాగాన ఉన్న పిల్లర్స్‌కు అల్లుకున్నాయి. ఇంటి ముందు చిన్న పూల తోట. బాట కిరువైపుల బారులు తీరి బంతులు, చేమంతులు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయి. వాటి వెనుక వరుసలో సుగంధ రాజాల, గులాబీల సోయగాలు. కాంపౌండ్ వాలు నానుకొని ఒక వైపు మల్లెపందిరి, మరొక వైపు విరగబూసిన అందమైన పొందికతో పొగడచెట్టు.

తెలతెలవారుతూంది. ఆ రోజు ఆదివారం. విశాలి వనలక్ష్మిలా తన చిన్ని తోటలో విహరిస్తున్నది. తలారా స్నానం చేసి, చిలుకపచ్చ రంగు జరీ బార్డరున్న రోజ్ కలర్ కాటన్ చీరలో ఆమె తుషారంలో జలకాలాడిన విరిసిన కుసుమంలా ఉంది. ముఖానికి దిద్దుకున్న దోస పలుకు తిలకం ఆమె వయసును కాస్త తగ్గించి చూపుతున్నది. అయినా హుందాగా ఉంది. తొలకరి కిరణాలు జలతారుపోగులై అలవోకగా ఆమెను తాకుతున్నాయి. ఆ పూదోటను పలుకరిస్తూ వీస్తున్న ప్రాతః కాల సమీరం కమ్మటి వాసనను పంచుతూంది. మెల్లమెల్లగా నడుస్తూ, ప్రతి మొక్కను పలుకరిస్తూ కాసేపు గడిపింది. తరువాత పొగడ చెట్టు క్రింద కుర్చీలో కూర్చొని తన ముందు టేబుల్‌పై వున్న అందమైన డైరీలో స్రవంతిలా ప్రవహించే తనలోని భావాలకు అక్షర రూపం ఇవ్వడంలో నిమగ్నమైంది. అది అందమైన కవితగా మారుతూంది. ప్రతి ఆదివారం ఇట్లాగే తనకు నచ్చే విధంగా తోటలో గడపడం చాలా ఇష్టం విశాలికి. అందుకే "ఆదివారం ఆమె వారం" అని అంటూంటాడు మోహన్ తమ ఫ్యామిలీ ఫ్రెండ్స్‌తో. ఆదివారం ఉదయం ఏ తొందరా ఉండదు. భర్త, పిల్లలు ఆలస్యంగా లేస్తారా రోజు. విశాలి భర్త మోహన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ ఒక మల్టీనేషనల్ కంపెనీలో. పిల్లలు సమీర్, హిమబిందు మెడిసిన్ చేస్తున్నారు. సమీర్ ఫైనలియర్లో ఉన్నాడు. కూతురు హిమబిందు ఫస్టియర్ చేస్తుంది.

ఏకాగ్రతతో రాస్తూంది విశాలి.

'బాలభానుని బంగరు కిరణం
పచ్చని గరికను వెచ్చగ తాకేవేళ
ఉదయ సంధ్యలో విరిబాలలు వికసించే వేళ
సాయం సంధ్యలో సన్నజాజులు నవ్వే వేళ
అందమైన చందమామ అవనితో ఆటాడేవేళ
..... ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది విశాలి.

అప్పుడప్పుడే నిద్రలేచిన మోహన్ తోటలోని అందమైన తన విరిబోణిని చూచి, చప్పుడు కాకుండా మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెనుకవైపు నుండి వచ్చి, విశాలకి కొద్ది దూరంలో నిలబడి, ఆమె భుజాల మీదుగా చిన్నగా వంగి కవితను చదివాడు. ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్న ఆమె ముగ్ధమోహనరూపాన్ని చూసి అతనికి కూడా కవిత్వం వచ్చేసింది. ఆమె కవితను పూరిస్తూ "నా మనసంతా నీ తలపుల వసంత మాసం" అంటూ చిలిపిగా నవ్వాడు.

భర్తను చూచి పలుకరింపుగా చిన్నగా నవ్వుతూ "అరే అప్పుడే లేచారా!? బ్రష్ చేసుకొని రండి. కాఫీ కలుపుతాను" అంటూ డైరీని మూసి టేబుల్‌పై పెడ్తూ లేచింది విశాలి.

ఇద్దరూ కాఫీ తాగుతూ హాల్లో కూర్చున్నారు. ఇంతలో ఫోన్ మ్రోగింది. విశాలి లేచి ఫోనందుకుంది.

"హలో విశాలి స్పీకింగ్" అంది.

"హలో విశాలీ! నేను కల్యాణిని. కాలేజ్‌లో నీ బెంచి మేటుని... గుర్తొచ్చిందా...? అంటూ గలగల నవ్వింది.

"ఓ (కల్యాణి నీవా?) ఎట్లున్నావ్? ఎక్కడి నుండి మాట్లాడుతున్నావ్?" అంది ఆశ్చర్యంగా విశాలి. "హైదరాబాద్ నుండేనే - మావారొక బిజినెస్ మాగ్నెట్. బిజినెస్ పరంగా ఇక్కడే

సెటిలయ్యాం. ఒకే ఊళ్ళో ఉంటున్నా ఇన్నేళ్ళు మనం కలుసు కోలేదు. మొన్నొక రోజు గుళ్ళో రమ కలిసింది. అదేనే ఆ పొట్టి రమ – జ్ఞాపకం వచ్చిందా? నీవూ ఈ ఊళ్లోనే ఉంటావని చెప్పింది. నీ ఫోను నెంబరు అదే ఇచ్చింది" అంది కల్యాణి ఫుల్‌స్టాప్ లేకుండా గడగడ మాట్లాడేస్తూ.

"ఇంకా కల్యాణి ధోరణి మారనట్టుంది" అనుకుంటూ.

"ఏమైనా విశేషమా? ఊరికే చేయరు కద ఫోను మహానుభావులు" అంది విశాలి నవ్వుతూ.

"కరెక్ట్‌గా గెస్ చేశావు సుమా! మా అబ్బాయి పెళ్ళి నెక్స్ట్ ఆదివారం. వాడూ బిజినెస్ లైన్‌లోనే ఉన్నాడులే. నీవు మీ ఫ్యామిలీతో తప్పక రావాలి సుమా పెళ్లికి. మనం కలిసినప్పుడు అన్నీ మాట్లాడుకుందాం. ఇన్విటేషన్ పంపుతాను. నీ అడ్రస్ చెప్పు" అంది కళ్యాణి. అడ్రస్ చెప్పింది విశాలి. 'తప్పకరావాలని' మరొకసారి చెప్పి ఫోను పెట్టేసింది కల్యాణి.

"ఎవరు విశాలీ ఫోనులో"? చదువుతున్న పేపరులోంచి తల పైకెత్తుతూ అడిగాడు మోహన్.

"మా ఫ్రెండ్ కల్యాణి అని... తనూ ఈ ఊళ్ళోనే ఉందట. వాళ్లబ్బాయికి పెళ్ళట. తప్పక రమ్మంటూంది. ఫ్యామిలీతో.

"వెళ్ళు విశాలీ. చాలాకాలం తర్వాత ఫ్రెండ్స్ కలుసుకుంటే చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. నీ భాషలో చెప్పాలంటే సృష్టిలోనే మధురమైనది స్నేహితమన్నది' కవితా ధోరణిలోనే అన్నాడు భార్యను అనుకరిస్తూ.

విశాలి ఆలోచనలో పడింది 'వెళ్ళాలా? వద్దా? అని. మొదటి నుంచి కళ్యాణి వాళ్ళు కల వాళ్ళు ఆధ్వర్యం బాగా చూపించేది కాలేజీ రోజుల్లో కల్యాణి. తనకంటే తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళంటే తేలికగా చూసేది. ఆ మాటే అంది విశాలి భర్తతో.

"నాకూ వెళ్ళాలనే ఉంది. కాలేజి రోజుల పుటల్ని తిరగెయ్యాలని ఉంది. మా ఫ్రెండ్స్ కూడా చాలామంది వస్తారేమో! అందరినీ కలుసుకోవాలని ఉంది. కానీ కల్యాణి అహంభావి. అందుకే ఆలోచిస్తున్నా" అంది మోహన్‌తో.

"ఏదో కాలేజి రోజుల మాట కదా! అప్పుడు చిన్నతనం కదా విశాలీ! ఇప్పుడూ అట్లాగే ఉంటుందని ఎందుకనుకుంటావ్? అంతగా జ్ఞాపకం పెట్టుకొని ఇన్వైట్ చేసింది కదా. వెళ్తే బాగుంటుంది. ఆపై నీ ఇష్టం" అన్నాడు మోహన్ భార్యతో.

"నాకూ అట్లాగే అనిపిస్తూందండీ. సరే. అయితే అందరం కలిసి వెళ్దాం. ఫ్యామిలీతో రమ్మని మరీమరీ చెప్పింది కల్యాణి కొడుకు పెళ్ళికి" అంది విశాలి సంతోషంగా.

''ఏం మమ్మీ ఏదో పెళ్ళి మాటలు మాట్లాడుతున్నారు నీవు, డాడి. ఎవరికి పెళ్ళి నాకేనా?" అంటూ తన రూంలోంచి బయటకి వచ్చాడు సమీర్ తమాషాగా నవ్వుతూ.

"ఆడపిల్లను నాకు కాకుండా ముందు నీకేమిట్రా పెళ్ళి? నాకే అయ్యేంటుంది" అంది అప్పుడే నిద్రలేచిన హిమబిందు అల్లరిగా అన్నతలపై చిన్నగా మొట్టికాయ వేస్తూ.

"మీకెవ్వరికీ కాదు. మా ఫ్రెండ్ కల్యాణి కొడుక్కి" అంది విశాలి నవ్వుతూ.

"తమకు పెళ్ళి వయస్సొచ్చిందని గుర్తు చేస్తున్నారోయ్ మన పిల్లలు. ఈ జనరేషన్ చాలా ఫాస్ట్ కదా" తమాషాగా అంటూ పేపరు మడిచి టేబుల్‌పై పెడ్తూ లేచాడు మోహన్.

''మాకిప్పుడే పెళ్ళేమిటి డాడీ! జోక్ చేశామంతే'' అంటూ పిల్లలిద్దరూ బ్రష్ చేసుకోవడానికి వెళ్ళారు. విశాలి నవ్వుతూ తనూ లేచింది వాళ్ళిద్దరికీ కాఫీ కలుపుదామని. మోహన్ మార్నింగ్ వాక్‌కు బయలు దేరాడు.

రెండు రోజుల తరువాత పోస్ట్‌లో పెళ్ళి పత్రిక వచ్చింది. పెళ్ళి మంచి ఖరీదైన పెళ్లి మంటపంలో ఉంది. ఉదయం 11 గంటలకు పెళ్ళి ముహూర్తం. విశాలి, మోహన్ వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు.

"ఎలాగూ వెళ్తున్నాం కదా! కాస్త త్వరగా బయలుదేరి వెళ్దామండీ. కల్యాణితో కాసేపు మాట్లాడినట్లుంటుంది. తీరా ముహూర్తం ముందువెళ్తే, తను కొడుకు ప్రక్క పీటలపై కూర్చొని ఉంటుంది. తనకూ నన్ను పలుకరించడానికి

టై ఉండదు'' అంది విశాలి భర్తతో కరెక్టేననిపించింది మోహన్‌కు.

"ఉదయం ఏడు గంటలకే బయలుదేరుదాములే విశాలీ. అరగంటలో చేరుతాము కల్యాణ మంటపానికి" అన్నాడు మోహన్.

ఆ ఆదివారం విశాలి చక్కగా తయారైంది. భర్తకు కూడా మంచి డ్రస్ సెలెక్ట్ చేసింది. ఇద్దరూ అనుకున్న టైంకు మారుతీకారులో బయలుదేరారు పెళ్ళికి. విశాలికి సంతోషంగానూ కాస్త నెర్వస్‌గాను ఉంది. 'కళ్యాణి తప్ప తనకెవ్వరూ తెలియరక్కడ. ఎవరైనా ఫ్రెండ్స్ వస్తారో లేదో - పైగా భర్తను కూడా తీసుకెళ్తోంది. కళ్యాణి ఎట్లా ట్రీట్ చేస్తుందో? ... అయినా కాన్ఫిడెంట్‌గానే ఉంది. విశాలి. ఇప్పుడు తనొక రైటర్. పెళ్ళైన తరువాత భర్త ప్రోత్సాహంతో ఇంగ్లీషు లిటరేచర్‌లో ఎం.ఎ చేసింది. భర్త మంచి విద్యావంతుడు. కల్యాణి లాగ పెద్ద ధనవంతురాలు కాకున్నా మంచి స్థితిలోనే ఉన్నారు తాము. పైగా తన పిల్లలిద్దరూ కాబోయే డాక్టర్లు. తనకెందుకు కంగారు? - కల్యాణికి ఎంతైనా డబ్బుండుగాక. ఆమె మనసులో ఆలోచనలు ఈ విధంగా సుడులు తిరుగుతున్నాయి. కళ్యాణ మంటపం చేరింది కారు. మోహన్ ఒక వైపు పార్కు చేశాడు కారు. ఇద్దరూ కల్యాణ మంటపంలోనికి నడిచారు. ఇంకా గెస్టులెవ్వరూ ఎక్కువగా వచ్చినట్టు లేరు. అక్కడక్కడా కుర్చీల్లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు కొంతమంది. ఆహ్వానించే వాళ్ళెవరూ కనబడలేదు. పెళ్లి మంటపం దగ్గర నిలబడి కళ్యాణి ఎవరో ఖరీదైన గెస్టుల్తో మాట్లాడుతోంది సరదాగా నవ్వుతూ. 'బాగా లావెక్కింది కల్యాణి' అనుకుంది విశాలి. విశాలిని, మోహన్‌ను చూసింది కళ్యాణి. విశాలి చేయి ఊపింది స్నేహితంగా. కానీ చూసీ చూడనట్టు నటించింది కళ్యాణి. మనస్సు చిన్నబోయింది విశాలికి. పరిస్థితిని గమనించిన మోహన్ ముందుకు వెళ్ళకుండా అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. విశాలి మాత్రం కాస్త చొరవగా కళ్యాణి దగ్గరకు వెళ్ళింది "హలో కళ్యాణీ! హౌ ఆర్‌యూ? కంగ్రాట్స్" షేక్ హాండ్ ఇస్తూ అభిమానంగా మాట్లాడింది.

"ఆ...! బాగున్నాను" అంది నిరాసక్తిగా. ఆమె ముఖంలో ఇన్నేళ్ల తరువాత ఒక స్నేహితురాలిని కలిశాననే సంతోషం ఏ మాత్రం కనపడలేదు విశాలికి. పెళ్ళికి పిలిచి కావాలని క్యాలస్‌గా బిహేవ్ చేస్తోంది కళ్యాణి. హై సొసైటీ వాళ్ళమనుకొనే వాళ్ళకుండే మానసిక రుగ్మత ఇది. విశాలి ఆ షాక్‌లో ఉండగానే "టిఫిన్ చెయ్యండి. ఇటు వైపుంది డైనింగ్ హాల్" అంటూ డైనింగ్ హాలు వైపు దారి చూపించింది స్టైలుగా, మళ్ళీ మాటల్లో పడిపోయింది తన ఖరీదైన ఫ్రెండ్స్‌తో.

## భయంతో...

వైజాగ్ బీచ్‌లో కూర్చుని
కవిత రాయాలనిపిస్తుంది
నాకు అప్పుడప్పుడు.
చల్లని సాయంత్రం మా
ఇంటి అరుగుమీద కూర్చుని
కథ రాయాలనిపిస్తుంది
నాకు అప్పుడప్పుడు.
ఇరానీ టీ త్రాగుతుంటే
వింతయిన ఆలోచనలు
తన్నుకుంటూ వస్తాయి.
వచ్చిన ఆలోచనల్ని
పేపరుమీద పెట్టాలనుకుంటాను.
భాషా పరిజ్ఞానం లేక
కలానికి క్యాప్ తొడిగేస్తాను.
అందుకే నిరంతరం పఠిస్తూనే
ఉంటాను కవితల్ని... కథల్ని...
కవుల... కథకుల జీవితాల్ని
చదివింది అర్థం చేసుకునే
జ్ఞానం నాకు ఇప్పుడిప్పుడే
తెలుస్తూంది.
ఇంత చదివి- జ్ఞానం
పొందుతుంది ఎందుకో తెలుసా...?
కళామతల్లికి నే బిడ్డ కాలేనేమోనన్న భయంతో...!

**-సలిగంటి కొమరయ్య**

మనసు చివుక్కుమంది విశాలికి. టిఫిన్ చేయాలనిపించలేదు. ఆ మాటే అంది విశాలి మోహన్ ప్రక్కన కూర్చుంటూ. కానీ మోహన్‌కు తెలుసు. విశాలి ఆకలికి ఆగలేదని.

"టిఫిన్ చేద్దాం రా విశాలీ! మళ్ళీ ముహూర్తమైై, భోజనాల వేళకు బాగా టైమవుతుంది కదా వెళదాం రా" అంటూ తను లేచి స్నేహితంగా చేయి అందించాడు మోహన్. మోహన్ చెయ్యి అందుకుంటూ తనూ లేచింది విశాలి. డైనింగ్ హాల్లో కెళ్ళారిద్దరూ కానీ విశాలికి ఏమీ తినాలపినిపించలేదు. ఆ మాటే చెప్పింది మోహన్‌తో "సరే అయితే వేడివేడి కాఫీ తాగుదాం" అన్నాడు మోహన్. కాఫీ తాగుతూ కూర్చున్నా రిద్దరూ. విశాలి మూడ్ మార్చడానికి జోక్స్ వేసి నవ్వించాడు మోహన్. కాసేపటికి కాస్త తేరుకుంది విశాలి. మెల్లగా కళ్యాణ మంటపంలోనికి వచ్చారిద్దరూ. అటు ఇటూ తిరుగుతూ ఏదో 'బిజీ'గా ఉన్నట్టు నటిస్తూంది కల్యాణి. ఇప్పుడైనా కళ్యాణి ఫ్యామిలీ గురించి అడగాలని, తన భర్తను పరిచయం చేసి, పిల్లల్ని గురించి చెప్పాలని తాపత్రయ పడింది విశాలి. విశాలే చొరవగా ఏయ్ కల్యాణీ! మీ అబ్బాయిని అదే - పెళ్లి కొడుకును, పెళ్ళి కూతుర్ని పరిచయం చేద్దువు పద - బైదిబై - వీరు మా శ్రీవారు మోహన్ - మల్టినేషనల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్‌గా పని చేస్తున్నారు. నాకిద్దరు పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. ఇద్దరూ మెడిసిన్ చేస్తున్నారు. ఇక నేను ఒక రైటర్‌గా స్థిరపడ్డాను. 'జాహ్నవి' నా పెన్ నేమ్. మావారి ప్రోత్సాహంతో ఈ మధ్యే ఇంగ్లీష్ ఎం.ఎ...." ఇంకా విశాలి మాటలు పూర్తి కాలేదు. కల్యాణి ముఖం అప్రసన్నంగా మారి పోయింది. విశాలి మాటలకు అడ్డుపడుతూ "ఇంట్రడక్షన్"కు ఇంకా చాలా టైం వుందిలే. ఉంటావుగా చాలా సేపు. కూర్చోంది. ఇప్పుడే వస్తా." అంటూ "హలో హలో" అనుకుంటూ గెస్టలను రిసీవు చేసుకునే నెపంతో వాళ్ళనక్కడే వదిలేసి వెళ్ళిపోయింది. "ఇంత వయసొచ్చినా ఇంకా కల్యాణి ప్రవర్తన మారలేదన్న మాట. వయసుతో పాటు అహం కూడా పెరిగింది" అప్రయత్నంగా ఆమె నోట వెలువడ్డాయి ఆ మాటలు.

"ఉష్. మెల్లగా... ఏమిటి కామెంట్స్?" అన్నాడు మోహన్ చిన్నగా. ఇద్దరికీ చాలా ఎంబరాసింగ్‌గా ఉంది ఆ పరిస్థితి. అయినా ముఖంలో ఎలాంటి చీకాకు చూపకుండా ఇద్దరూ మాట్లాడుతూ కూర్చున్నారు. టైం గడుస్తోంది. పెళ్ళి హాలు దాదాపు నిండిపోయింది. చుట్టూ కలియచూసింది విశాలి. తన ఫ్రెండ్సెవ్వరూ కనపడ లేదు. "కల్యాణి స్వభావం తెలిసి ఎవ్వరూ రాలేదేమో" అనుకుంది. పెళ్ళి మంటపం వైపు దృష్టి సారించారిద్దరూ. పెళ్లి కొడుకు అచ్చం తల్లి పోలికే. బొద్దుగా, నల్లగా ఉన్నాడు. పెళ్ళికూతురు సన్నగా, తెల్లగా మెరుపు తీగెలా ఉంది. 'శంపాన్విత మేఘం' గుర్తుకు వచ్చింది విశాలికి. "తల్లి రూపం వచ్చినా, తల్లి గుణం రాకుంటే బాగుండును. కొడుక్కు" అనుకుంది మనసులో. ముహూర్తం టైం అయింది.

మంగళ వాద్యాల మధ్య మంత్రోచ్ఛారణలతో మాంగల్యధారణ జరిగిపోయింది. అక్షింతలు వేశారు వధూవరులను దీవిస్తూ దంపతులిద్దరూ మంటపం పైకెళ్ళి తనను తను పరిచయం చేసుకుంటూ గిఫ్ట్ ఇవ్వాలనిపించలేదు విశాలికి. అంతలో కల్యాణి మండపం దిగి వస్తూ కనిపించింది. "కళ్యాణీ ఇక మేం వెళ్తున్నాం. ఇంకొక పెళ్ళికి అటెండ్ కావాలి" అంటూ సమాధానం కొరకు కూడా ఎదురు చూడకుండా, మోహన్ చెయ్యి పట్టుకొని చకచకముందుకు నడిచింది విశాలి.

కల్యాణ మంటపం నుండి బయటికి వచ్చిన తరువాత కారులో కూర్చుంటూ, "ఏమిటి విశాలీ! ఏ పెళ్ళీ లేదే. ఈరోజు! వధూవరులకు ఏ గిఫ్ట్ ఇవ్వకుండా భోజనం చెయ్యకుండా వచ్చేస్తే మీ ఫ్రెండ్ ఏమనుకుంటుంది చెప్పు?" అన్నాడు మోహన్ విశాలి ప్రవర్తన అర్థం కాక.

"మనమే మనుకుంటామో అనే దృష్టి దానికీ ఉండాలండీ. తన నిర్లక్ష్య ప్రవర్తనకు ఇదే సరైన ట్రీట్‌మెంట్" అంది విశాలి తనూ కారులో కూర్చుంటూ.

''మరి భోజనం మాటో? ఆకలి దంచేస్తుందోయ్'' అన్నాడు మోహన్.

నవ్వుతూ ఎదురుగానే ఉన్న స్టార్ హోటలు చూపించింది విశాలి. హోటల్ స్పెషల్ స్వీట్స్‌తో భోజనం ముగించి, పిల్లలకు స్వీట్స్ ప్యాక్ చేయించారు. అప్పుడు మోహన్ అడిగాడు. "ఇంతకూ ఏం గిఫ్ట్ తెచ్చావోయ్ నీ ఫ్రెండ్ కొడుక్కి?".

"ఇదిగో ఇది" అంటూ తన పర్స్‌లోంచి డబ్బుతీసి మోహన్‌కిస్తూ, అప్పుడే బిల్ తెచ్చిన బేరర్‌కివ్వమంది విశాలి.

"ఈ డబ్బు నేను రాసిన కథకు ప్రతిఫలం. నేను ఈ స్థితికి ఎదగడానికి ఎంతో ఎంకరేజ్ చేసిన మీకు, మన పిల్లలకు ట్రీట్ ఇచ్చినందుకు ఇది ఎంతో నద్వినియోగం'' . అంది తన కవితాధోరణిలో విశాలి. ఎంతో సున్నితంగా భావుకతతో ఉండే విశాలి. ఇంత ప్రాక్టికల్‌గా ఎప్పుడు మారింది? అని ఆశ్చర్య పడడం మోహన్ వంతైంది.

పెళ్ళి మంటపంలో బిజీగా ఉన్నట్లుంటూనే విశాలిని ఒక కంట గమనిస్తూనే ఉంది కళ్యాణి. ఎంతో హుందాగా ప్రవర్తించే వాళ్ళిద్దరి ప్రవర్తన, వాళ్ళది పొందికైన దాంపత్యమని చెప్పకనే చెబుతూంది. విశాలి చెప్పిందాన్ని బట్టి వాళ్ళ ఫ్యామిలీ మంచి ఎడ్యుకేటెడ్ ఫ్యామిలీ అని తెలిసింది. బిజినెస్‌తో పాటు డబ్బు, అన్ని వ్యసనాలు అబ్బిన తన భర్త గిరిధర్ వైపు చూసింది ఒక్కక్షణం. పగలబడి నవ్వుతూ మాట్లాడుతున్నాడు ఫ్రెండ్స్‌తో. తమ 'ఈగో' ప్రాబ్లమ్స్, ఇంట్లో గొడవలు, నిర్గంధకుసుమాలైన తన ఇద్దరు కొడుకులు - అంత సందడిలోనూ ఏకాకిగా ఫీలైంది కళ్యాణి.

వెళ్ళిపోతున్న విశాలి, మోహన్‌ల వైపు చూస్తుండగానే అదే కల్యాణమంటపాని కెదురుగా ఉన్న స్టార్ హోటలుకెళ్ళారు వాళ్ళు. అదీ కారులో - చేదు మాత్ర మింగినట్లయింది కళ్యాణికి.

స్టేటస్‌లో తనకంటే తక్కువ స్థాయిలో ఉన్న తన ఫ్రెండ్ ముందు తన దర్పం ప్రదర్శించి ఆమె ముఖం చిన్నబోతే చూసి ఆనందించాలనుకునే పైశాచికత్వాన్ని పటాపంచలు చేస్తూ వెళ్ళిపోయింది విశాలి! అంత మేపకలోనూ కళ్యాణి ముఖం ఫేడయిపోయింది. ■

# నానీలు

**వా**యు వలయంలో
సుడిగుండం!
కడలి కడుపులో
వాయుగుండం!!

**కొం**డపైన
పరదాలో
మబ్బుల చిల్లులు
ఆకాశం!

**మె**రుపు వీపుపై
ఉరుము సవారీ
గాలి కబురుతో
వాన ప్రయాణం!

**చె**రువులో రాల్తున్న
చినుకుల గింజలు
ఏరుకు తింటున్నాయి
నా కళ్ళ పిచ్చుకలు!

**చె**ట్టుపైన
చుక్కల పూలు
చెట్టు క్రింద
రాలిన చుక్కలు!?

**ప**గలొక రంగూ
రాత్రొక రంగు
దృష్టికి మృగ్యం
వాయువు!

**ఉ**దయం పశ్చిమానికి
సాయంత్రం తూర్పుకి
సాష్టాంగ ప్రణామం
విద్యుత్ స్తంభం!

**-భుజంగరావు కంచరాన**